ఎర్రగాజు

టెంపోరావ్

విజయవాడ స్టేషన్‌లో లీల ఎక్స్‌ప్రెస్‌లో ఎక్కింది. వెనకనే ఆమె అన్న రామరాజు ఎక్కాడు. ఇద్దరూ కొంతసేపు మౌనంగా నిలబడ్డారు.

"అన్నయ్యా, సీటు రిజర్వేషన్ కూడా దొరకలేదు. మద్రాస్ దాకా ఇలా నుంచునే వెళ్ళాలేమో!" అంది లీల.

"డోంట్ వర్రీ! ఎవరో కొంచెం జరిగి నిన్ను కూర్చోమంటారు" అన్నాడతను.

ఆ మాట విని సమీపంలో వున్న కోకిల వాళ్ళవైపు చూసింది. ఆమె వయస్సు నలభై దాటింది.

"నువ్వెళ్ళు అన్నయ్యా! పాపం అమ్మ ఒక్కత్తే వుంటుంది" అంది లీల.

"మరేం ఫరవాలేదులే! నీకు ఎక్కడో సీటు చూసి, కూర్చోబెట్టి వెళ్తాను."

ప్లాట్‌ఫామ్‌మీద నుంచి అమ్మేవాళ్ళ అరుపులు వినపడుతున్నాయి. తనకు తెలిసిన వాళ్ళు యెవరేనా కని

పిస్తారా అని రామరాజు ముందుకూ, వెనక్కీ చూశాడు.

"నువ్వు ఎందాకా వెళ్ళాలమ్మా?"

ఆ ప్రశ్న విని లీల తృళ్ళిపడింది. రామరాజు పక్కకు చూశాడు.

కోకిల నవ్వుతూ వాళ్ళవైపు చూస్తోంది. రామరాజు ఆమె దగ్గరకు జరిగాడు.

"ఈమె నా చెల్లెలు లీల. మద్రాస్ వెళ్తోంది" అన్నాడతను.

"ఇలా కూర్చోవమ్మా!" అంది కోకిల.

ఆమె పక్కనే లీల కూర్చుంది. సంతోషపడ్తూ రామరాజు ఆమెవంక చూశాడు.

"మీరు మద్రాస్‌కే వెళ్తున్నారా?"

"యస్, మద్రాసే! అక్కడ గాబ్రియల్ సర్జికల్ క్లినిక్‌లో నర్సుగా పనిచేస్తున్నాను" అందామె.

"చూడండి, మా చెల్లెలు యింతవరకూ మద్రాస్ వెళ్ళలేదు. ఒంటరిగా ప్రయాణం చేయలేదు. అందువలన నాకు గాభరాగా వుంది."

"భయపడకండి! మద్రాస్‌లో ఎక్కడికెళ్ళాలి?"

"మోటర్స్ యింజనీరింగ్ కంపెనీ వాళ్ళు నన్ను యింటర్వ్యూకి రమ్మన్నారు. బి. ఎ. పాసయ్యాను" అంది లీల.

"ఎప్పుడు యింటర్వ్యూ?"

"రేపు పదింటికి."

"నీకు ఏ బెంగా లేదమ్మా. మద్రాస్‌లో నేను నీకు సహాయపడ్తాను" అంది కోకిల.

"చాలా థాంక్స్. మద్రాసులో నా ఫ్రెండ్ శాంతారావు వున్నాడు. అతడికి ఉత్తరం రాశాను.

అతడు స్టేషన్‌కి వస్తాడు. అతడికి మీరు లీలను అప్పగిస్తే చాలు, ఎంతో సంతోషిస్తాను" అన్నాడు రామరాజు.

"అలాగే చేస్తాను" అంది కోకిల.

రామరాజు కృతజ్ఞతతో ఆమెవైపు చూశాడు.

"దేవతలా మీరు దొరికారు. చాలా సంతోషం. ఒకవేళ నా ఫ్రెండ్ స్టేషన్‌కి రాకపోతే అతని యింటి ముందు నా చెల్లెల్ని దింపండి. అతని అడ్రెస్ ఆమె దగ్గరుంది."

"దానికేముంది! అలాగే అతడి యిల్లు చూపిస్తాను" అని ఆమె రామరాజువైపు నవ్వుతూ చూసింది.

"లోకంలో అనేకమంది దుష్టుల మధ్య మనం జీవిస్తున్నాం. మీరు నన్ను కూడా నమ్మకూడదు. నా అడ్రెస్ గుర్తుంచుకోండి! మిస్ కోకిల, గాబ్రియల్ సర్జికల్ క్లినిక్, హాల్స్ రోడ్డు, ఎగ్మూరు, మద్రాసు. గత పదేళ్ళ నుంచీ అక్కడే పనిచేస్తున్నాను" అందామె.

ఆమె అడ్రసు అతడు రాసుకున్నాడు.

"మీలాంటి సహృదయుల అడ్రెస్ నా దగ్గర వుండడం మంచిది. నా చెల్లెలు యింటర్వ్యూ అవగానే ఏదో ట్రెయిన్‌లో ఎక్కి తిరిగి వచ్చేస్తుంది. అదంతా నా మిత్రుడు చూస్తాడు."

"మా యింట్లో ఒకరోజైనా వుండాలి మీ చెల్లెలు!" అందామె నవ్వుతూ.

"నాకంటె మా అమ్మకి బెంగ ఎక్కువ. ఎలాగో పట్టుబట్టి అది మద్రాస్ వెళ్తోంది. ఉద్యోగం కోసం మద్రాస్ వెళ్ళడం నాకిష్టంలేదు. ఏదో మంచి ఉద్యోగం యిక్కడే దొరుకుతుందని నేనెంత చెప్పినా అది వినలేదు."

"వయస్సులో వున్న వాళ్ళకు ధైర్యం ఎక్కువ!" అందామె నవ్వుతూ.

రామరాజు కిందకు దిగాడు. కిటికీలోంచి లోపలకు చూస్తూ నుంచున్నాడు. అతడి చూపు క్షణకాలం లీల మీదే వుంది!

లీల చిరునవ్వు అతడికి ధైర్యాన్నిచ్చింది.

"నువ్వు దిగులుపడకు అన్నయ్యా! రేపు రాత్రి ట్రెయి నెక్కి ఎల్లుండిపొద్దుటే నీ ముందు వుంటాను" అంది లీల.

ఎక్స్‌ప్రెస్ కూత వినపడింది. అతడు చెల్లెలివైపు, కోకిలకేసి చూశాడు. ఎక్స్‌ప్రెస్ కదిలింది. కొంతదూరం అతను ప్లాట్‌ఫామ్‌మీద పరుగెత్తాడు. ఎక్స్‌ప్రెస్ వేగంగా ముందుకు వెళ్ళిపోయింది. అతను అలా నిలబడి, వెళ్ళిపోతున్న ట్రెయిన్‌వైపు చూశాడు. ఆలోచిస్తూ వెనక్కి తిరిగి బయటకు నడిచాడు.

తన చెల్లెలు మద్రాస్ వెళ్ళి క్షేమంగా తిరిగిరావాలని దేవుడిని ప్రార్థించాడు.

2

కోరమండల్ ఎక్స్‌ప్రెస్ యెక్కడా ఆగకుండా ప్రయాణం సాగిస్తోంది.

"కోకిలకూ, లీలకూ బాగా స్నేహం అయిపోయింది. తను తెచ్చుకున్న వడలు ఆమె లీలకిచ్చి తినమంది. లీల ఆమెకు యిడ్లీ చట్నీ యిచ్చింది.

"నువ్వు ఎంతవరకూ చదువుకున్నావు?" అడిగింది కోకిల.

"బి. ఎ. పాసయ్యాను. టైపింగ్ హయ్యర్, షార్టు హేండ్ లోయర్ పాసయ్యాను."

"నీ అన్నకు పెళ్ళయిందా?"

"కాలేదు. నా పెళ్ళి అయిందాకా పెళ్ళాడకూడదని అన్నయ్య నిశ్చయించుకున్నాడు. అమ్మా నేనూ ఎంత చెప్పినా వినడు!"

"అతడి వయస్సు ముప్ఫయి వుంటుందా?"

"మీరు కరెక్టుగా వూహించారు. అన్నయ్య నాకంటె 8 ఏళ్ళు పెద్ద" అంది లీల.

"అమ్మా, అన్నయ్యా నువ్వూమాత్రం యింట్లో వుంటున్నారా?"

లీల తలాడించింది. కోకిల ఫ్లాస్కులోని కాఫీని గ్లాసులో పోసి ఆమెకిచ్చింది. ఆమె తాగింది. అదే గ్లాసులో కాఫీ పోసుకుని కోకిల తాగేసింది.

కోకిల నవ్వుతూ లీలవైపు చూసింది. లీల చాలా అందమైన యువతి. కుడిచేతికి ఎర్రటి గాజులున్నాయి!

మొహం చూస్తే అమాయకురాల్లా లీల కనిపిస్తోంది.

"నువ్వు ఒంటరిగా ఎక్కడకూ వెళ్ళలేదా?"

"అన్నయ్యో, అమ్మో కూడా లేకుండా నేను బయట ఊళ్ళకు వెళ్ళలేదు. నేను వెళ్ళాలనుకున్నా వాళ్ళు వెళ్ళనివ్వరు."

"ఇప్పుడు మద్రాస్ ఎలా వెళ్ళనిచ్చారు?"

"అన్నయ్య నాతో వస్తానన్నాడు. కాని అర్జంట్ పనివలన అతడికి సెలవు దొరకలేదు. నన్ను వెళ్ళొద్దన్నాడు. నేను వెళ్ళితీరాలని పట్టుబట్టాను. చివరికి అన్నయ్య సరే అన్నాడు. ఈసారి ఎంత వద్దన్నా నేను మాననని అన్నయ్య గ్రహించాడు. అందుకే వూరుకున్నాడు.

"మీ అన్నయ్య ఫ్రెండ్ కాంతారావు నీకు బాగా తెలుసా?"

"తెలుసు! అతడు స్టేషన్‌కు వస్తాడో రాడో! అన్నయ్య ఉత్తరం ఆలస్యంగా రాశాడు."

కోకిల ఆమె చెయ్యి పట్టుకుంది. నవ్వుతూ ఆమె కళ్ళలోకి చూసింది.

"లీలా, డోంట్ బాదర్! కాంతారావు స్టేషన్‌కి రాకపోతే ఆయనింటికి నిన్ను నేను తీసుకెళ్తాను. భయం లేదు" అంది కోకిల.

దేవతలా ఆమె దొరికినందుకు లీల లోలోపల ఆనందించింది.

చీకటిపడ్తోంది. సెంట్రల్ స్టేషన్‌లోని లైట్లు ప్రకాశవంతంగా వెల్గుతున్నాయి. కోరమండల్ ఎక్స్‌ప్రెస్ ఆగింది.

కోకిల, లీల కిందకు దిగారు. లీల చేతిలో ఏర్ బాగ్ వుంది. ప్లాట్ ఫామ్‌మీద చాలా రద్దీగా వుంది.

"ఆ కాంతారావు ఎవరో నువ్వే గుర్తుపట్టాలి లీలా" అంది కోకిల.

ఒక వ్యక్తి కోకిల పక్కనుంచి మెల్లిగా కదిలాడు. పావుగంటవరకూ వాళ్ళు చూస్తూ వుండి పోయారు.

"మా ఇంటికి పోదాం, పద! కాంతారావుకి ఉత్తరం అందలేదేమో!" అంది కోకిల.

"మరో ఐదు నిమిషాలు చూద్దాం" అంది లీల.

ఐదు నిమిషాలు దాటిపోయింది. ఏం చెయ్యాలా అని లీల గాభరా పడ్తోంది.

నలభై ఏళ్ళ మనిషి వాళ్ళముందుకు వచ్చాడు. లీలవైపు పరీక్షగా చూశాడు.

"అమ్మాయి, నీ పేరు?" ప్రశ్నించాడతను.

"లీల. మాది విజయవాడ" అందామె.

"కాంతారావుకోసం చూస్తున్నావా?"

ఆమె తలాడించింది.

"ఆయన మిమ్మల్ని పంపారా?"

"అతడికి ఆరోగ్యంగా లేదు. నన్ను వెళ్ళమన్నాడు. ఇలా వచ్చాను—ప్లాట్ ఫామ్‌మీద తిరిగి తిరిగి చెప్పులు అరిగిపోయాయి!" అన్నాడతను.

"కాంతారావుగారు రాకపోతే తప్పక ఎవరినేనా పంపుతారని నేనన్నానుగా!" అంది లీల సంతోషంగా కోకిలవైపు చూస్తూ.

కోకిల క్షణకాలం అతడివైపు చూసింది.

"మీ పేరు?"

"రామ్మూర్తి."

"కాంతారావు మీ ఫ్రెండా?"

"ఇద్దరం ఒకే ఆఫీసులో పనిచేస్తున్నాం. ఇంకా ఏమైనా ప్రశ్నలు అడగాలా?"

"క్షమించండి! లీల మొదటిసారిగా మద్రాస్ వచ్చింది. అందుకని అడుగుతున్నాను" అంది కోకిల.

"మీరూ మాతో రండి! కాంతారావుకు ఆమెను మీరు అప్పగించవచ్చు!" అన్నాడతను.

అతడామాట అనగానే ఆమెలోని అనుమానం మాయమైంది. ఆమె లీలవైపు నవ్వుతూ చూసింది.

"లీలా, రేపు ఇంటర్‌వ్యూ అయాక ఒకసారి మా ఇంటికి రా! అడ్రెసు యిచ్చేనుగా!"

"నేనే తీసుకొస్తాను" అన్నాడతను.

"రా అమ్మా, పోదాం! మరీ ఆలస్యమైతే నువ్వు ఏమయ్యావో అని కాంతారావు గాభరాపడ్తాడు" అన్నాడతను.

అతడితో లీల వెళ్ళిపోయింది. తన సూట్ కేసు, బాగ్ తీసుకొని కోకిల బయటకు నడిచింది.

బయట నిలబడి కోకిల ఆటోకోసం చూస్తోంది. ఆమె ముందునుంచి ఒక టాక్సీ దూసుకుపోయింది. అందులో వున్న లీల ఆమెకు బై బై చెప్పింది.

టాక్సీ నంబరుమీదకు ఆమె చూపు వెళ్ళింది. అప్పుడే అక్కడికొచ్చి ఆగిన ఆటోలో ఎక్కిందామె.

"ఎగ్మూరు" అందామె.

ఆటో బయటకు దూసుకు పోయింది.

3

రోడ్డు దీపాలు ప్రకాశవంతంగా వెలుగుతున్నాయి. వెనుక సీటుమీద కూర్చుని లీల కారు కిటికీలోంచి ముచ్చటగా బయటకు చూస్తోంది.

అనేక రోడ్లు తిరిగి టాక్సీ సాగిపోతోంది. పక్క కూర్చున్న రామ్మూర్తివైపు ఆమె తిరిగింది.

"ఇంకా ఎంతదూరం వెళ్ళాలి?" అడిగిందామె.

"చాలాదూరం వెళ్ళాలి!" అన్నాడతను.

ఆమె మళ్ళీ బయటకు చూస్తూ ఆలోచించసాగింది. కాంతారావు యిల్లు సెంట్రల్ స్టేషన్కు దగ్గరగానే వుందని అన్న చెప్పడం ఆమెకు గుర్తొచ్చింది. బస్సులో వెళ్తే పదిహేను నిమిషాల్లో కాంతారావు యిల్లు చేరుకో వచ్చు అన్నాడు అన్నయ్య. పదిహేను నిమిషాలు పైన టాక్సీ వెళ్తూంది. అయినా కాంతారావు యిల్లు రాలేదు!

కాంతారావు ఇల్లు మారాడా? ఆ ప్రశ్న మెదడులో లేవగానే ఆమె వులిక్కిపడింది. అన్నయ్య రాసిన ఉత్తరం అతడికి అందలేదేమో!

అయితే తన పక్క కూర్చున్నతను ఎవరు? నిజంగా

కాంతారావు ఫ్రెండేనా?

"మద్రాస్ నువ్వు ఎందుకొచ్చేవమ్మా?" అడిగాడతను.

"కాంతారావుగారు చెప్పలేదా?"

"అతడికి తొందర ఎక్కువ. నన్ను స్టేషన్‌కి వెంటనే వెళ్ళమన్నాడు. నీ పేరూ, ఊరూ చెప్పాడు. మీ పక్కనుంచి వెళ్తూ నిన్ను లీలా అని ఆమె పిలవడం విన్నాను. లేకపోతే నిన్ను పోల్చడం నాకు ఎంతో కష్టమయ్యేది" అన్నాడతను.

అతడు చెప్పినదాన్ని గురించి ఆమె ఆలోచిస్తోంది. లీల తెలివిగల యువతి. ఎవరు ఏం చెప్పినా నమ్మదు. "ఎందుకొచ్చావో చెప్పలేదు!"

"మోడర్న్ ఇంజనీరింగ్ కంపెనీ తెలుసుగా, మైలాపూర్‌లో వుంది. వాళ్ళు నన్ను యింటర్‌వ్యూకి రమ్మన్నారు."

"ఇంటర్‌వ్యూ ఎన్నింటికి?"

"రేపు పదింటికి."

"ఆఫీసుకు లీవుపెట్టి నేను నిన్ను అక్కడకు తీసుకు వెళ్తానులే" అన్నాడతను.

"కాంతారావుగారు రాలేరా?"

"జ్వరం తగ్గితే అతనే వస్తాడు."

అతడు ముందుకు వంగి టాక్సీ డ్రయివర్‌కు ఏదో చెప్పాడు. ఒక టెలిఫోన్‌బూత్ దాటి టాక్సీ వెళ్ళింది. చటుక్కున ఆగింది.

అతడు కిందకు దిగాడు. గబగబా బూత్‌వైపు పరుగెత్తాడు. వెనక్కు తిరిగి ఆమె చూసింది. అతడు ఏదో నంబరు తిప్పుతున్నాడు.

లీల తీవ్రంగా ఆలోచించసాగింది. ఇరవై నిమషాలు పైన టాక్సీ కదుల్తూనే వుంది. కాని కాంతారావు యిల్లు యింకా రాలేదు. ఆమెలో అనుమానం తలెత్తింది.

వెనక్కి తిరిగి ఆమె చూసింది. ఇంకా అతడు ఫోన్‌లో మాట్లాడుతూనే వున్నాడు. టాక్సీ డ్రయివర్ సిగరెట్ కాలుస్తూ కూర్చున్నాడు. కారు తలుపు మెల్లిగా తెరిచి, ఏర్ బాగ్ తీసుకుని ఆమె కిందకు దిగింది. రోడ్డు దాటి అటువైపు వున్న షాపుల వైపు పరుగెత్తింది. వేగంగా నడుస్తూ పేవ్‌మెంటమ్మట వెళ్ళిపోయింది.

రిసీవర్ పెట్టేసి బూత్‌లోంచి అతడు బయటపడ్డాడు. పరుగెత్తుకొచ్చి టాక్సీ ఎక్కి తలుపు మూశాడు. పక్కకు చూశాడు. ఆమె లేదు.

"అమ్మాయి ఎక్కడ?" అడిగాడు డ్రయివర్ని.

"ఎక్కడికి పోయిందో నాకేం తెలుసు?" అన్నాడు డ్రయివర్.

అతను కిందకు దిగి ఆమెకోసం యిటూ, అటూ చూశాడు. ఎక్కడా కనపడలేదు.

"నేనలా వెళ్ళి చూసి వస్తాను. నువ్వు యిక్కడే వుండు" అన్నాడతను.

"మీటర్ చార్జి చెల్లించి వెళ్ళి వెతుకు!" అన్నాడు డ్రయివర్.

అతడు మీటర్ చూసి డబ్బు చెల్లించాడు. వేగంగా రోడ్డు దాటి ఆమెను వెతుకుతూ వెళ్ళాడు.

4

లీల ధైర్యంగా ముందుకు నడుస్తోంది. ఒక బట్టల షాపు బోర్డును చూసి తను అయినావరంలో వున్నట్లు గ్రహించింది.

ఇప్పుడు తనేం చెయ్యాలి? ఆమె టైము చూసింది. ఏడు దాటింది. తిన్నగా కోకిల యింటికి వెళ్ళటం మంచిదేమో! ఏమో, కోకిల ఎటువంటిదో!

తనకు సంభవించిన అనుభవాన్నిబట్టి ఆలోచిస్తే యీ పట్నంలో ఎవర్నీ నమ్మకూడదు అనిపిస్తోంది.

టాక్సీలోని వ్యక్తి తనకోసం వెతుకుతాడేమో! తను ధైర్యంగా వుండాలి! ఈ మహాపట్నంలో ధైర్యంవుంటే గాని బతకడం కష్టం.

పేవ్ మెంటమ్మట పోతూ ఆమె ఏదో బోర్డు చూసి ఆగింది. హోటల్ మిడ్ లాండ్, బోర్డింగ్ అండ్ లాడ్జింగ్ అని పెద్ద అక్షరాల్లో వుంది.

హోటల్లో అనేకమంది వుంటారు. అక్కడ గది తీసుకొని వుండడం మంచిదేమో!

ఆమె ఆలోచిస్తూ లోపలకు వెళ్ళింది, ముందు గదిలో కౌంటర్ వెనక వున్న గుమస్తా ఆమెవైపు చూశాడు.

"నాకు గది కావాలి" అందామె.

"ఎన్ని రోజులుంటారు?" అడిగాడు గుమస్తా.

"రేపు సాయంత్రం వెళ్ళిపోతాను."

"గదికి అద్దె 30 రూపాయలు. టిఫిన్, భోజనం వగైరా కావలిస్తే వాటికి వేరే డబ్బు చెల్లించాలి."

"ఆల్ రైట్."

అతడు పెద్ద బుక్కులో ఆమె వివరాలన్నీ రాసి, సంతకం పెట్టమన్నాడు. సంతకం పెట్టాక 30 రూపాయలు అడ్వాన్స్ యిమ్మన్నాడు. ఆమె యిచ్చింది.

అతడు ఒక తాళంచెవిని ఆమెకిచ్చాడు.

"రూమ్ నంబరు 20. కింద భాగంలోనే వుంది. అలా వెళ్ళి కుడివైపు తిరగండి. మీ గది వస్తుంది."

ఆమె వెనుతిరిగి నడిచింది. నడవమ్మట వెళ్ళి 20 నంబరు తాళం తెరిచి లోపలకు అడుగు పెట్టింది.

గది చిన్నదైనా శుభ్రంగా వుంది. యటాచ్‌డ్ బాత్ రూం వుంది. గది తలుపును మూసి, లోపల గడియను బిగించిందామె. కుర్చీలో కూర్చుని కాస్సేపు విశ్రాంతి తీసుకుంది.

అన్నయ్య రూపం ఆమె మెదడులో మెదిలింది. అతడు తనను బి.ఎ.దాకా చదివించాడు. తనకోసం ఎంతో కష్టపడుతున్నాడు. తన కోసం అతని సుఖాన్ని త్యాగం చేశాడు.

అందుకే ఆమె తెగించి మద్రాస్ వచ్చింది. తను కూడా ఎంతో కొంత గడిస్తే కుటుంబానికి వుపయోగపడుతుంది. తన అన్నకొచ్చేది ఎనిమిదివందలే. అందులో ముగ్గురు జీవించాలి. ప్రతి నెలా అందులోంచి వంద రూపాయలు అన్నయ్య బ్యాంకిలో వేస్తాడు తన పెళ్ళి కోసం!

అన్నయ్య మంచి బట్టలు కూడా కొనుక్కోడు. పాత పాంట్లతో జీవితాన్ని గడిపేస్తున్నాడు.

తను డబ్బు గడించి కుటుంబ పరిస్థితిని మార్చాలి! ఎవరో తలుపును తట్టారు. ఆమె త్రుళ్ళిపడుతూ తన వూహల్లోంచి మేలుకొంది.

మెల్లిగా వెళ్ళి తలుపును తెర్చింది. హోటలు నౌఖరు బయట నిలబడి వున్నాడు.

"మీకు భోజనం కావాలా?"

"మరో అరగంటలో గదికి పట్రా" అందామె.

అలాగే అని చెప్పి అతడు వెళ్ళిపోయాడు. ఆమె తలుపును మూసి గడియ పెట్టింది.

యటాచ్‌డ్ బాత్‌రూమ్‌లోకి వెళ్ళి ఆమె హాయిగా స్నానం చేసింది. దుస్తులు మార్చుకుని ఆమె పరుపు మీద వాలింది.

తలుపు తట్టగానే ఆమె లేచింది. తలుపు తెర్చింది. హోటలు నౌఖరు పెద్ద ప్లేటులో భోజనం తెచ్చి టేబుల్ మీద వుంచాడు. కూజాలోని నీళ్ళు గ్లాసులో పోసి పక్కనే పెట్టాడు.

"చూడండి, మరేదైనా కావాలా?" అడిగాడతను.

ఆమె కంచంవైపు చూసింది.

"ఏమీ అక్కరలేదు. అరగంట తర్వాత వచ్చి నువ్వు ప్లేటు పట్టుకుపోవచ్చు" అందామె.

అతను బయటకు వెళ్ళిపోయాడు. ఆమె తలుపు మూసుకొని భోజనం చేయడం ప్రారంభించింది. ఇప్పుడామెకు ధైర్యంగా వుంది. ఆకలితో ఆమె తినసాగింది.

5

సరిగ్గా తొమ్మిదిన్నరకి లీల మోడర్న్ యింజనీరింగ్ కంపెనీ ఆఫీసుకు చేరుకుంది.

విశాలమైన ముందు హాల్లో ఒక యువకుడు ఆమెకు ఎదురయ్యాడు. ఆమెవైపు అతను ఆశ్చర్యంగా చూశాడు.

"మీరు స్టెనోగ్రాఫర్ ఉద్యోగానికి వచ్చారా?" తీయటి కంఠంతో అడిగాడతను.

"అవును. నా పేరు లీల. విజయవాడనుంచి వచ్చాను" అందామె.

ఆమెను తనతో రమ్మన్నాడతను. అతడి వెనకనే ఆమె నడుస్తోంది.

"నా పేరు ఆనందమోహన్. నేను యీ కంపెనీ

అధిపతికి పెర్సనల్ అసిస్టెంట్ గా వుంటున్నాను" అన్నాడతను.

"వెరీ హేపీ టు మీట్ యూ" అందామె.

ఒక గదిలోకి అతడామెను తీసుకువెళ్ళాడు. గదిలో వందమంది యువతులు కుర్చీల్లో కూర్చుని వున్నారు.

వాళ్ళను చూసి ఆమె ఉలిక్కిపడింది. అతడి వంక చూసింది.

"ఒక ఉద్యోగానికి యింతమంది కాండిడేట్సా?" అడిగింది ఆశ్చర్యంగా.

"మా కంపెనీ చాలా పెద్దది. సెనో టైపిస్టుకి ఇక్కడ 1200 యిస్తారు. అందువలన ఎక్కువమంది వస్తారు" అన్నాడతను.

గుమ్మంలో నిలబడి ఆమె అందరివైపూ చూసింది. అంతమందిలో తనకు ఉద్యోగం వచ్చే అవకాశం తక్కువ. తను అనవసరంగా ఇంతదూరం వచ్చింది. రైలు ఖర్చు, హోటలు ఖర్చు దండగ.

"మిస్ లీలా, మీరు వెళ్ళి కుర్చీలో కూర్చోండి."

"ఆమె వెనుదిరిగి అతడివంక చూసింది.

"ఈ ఇంటర్వ్యూ అవడానికి ఎంత టైము పడ్తుంది?" అడిగిందామె.

"కాండిడేట్స్ ఎక్కువమంది వున్నారుగా, అందువలన కంబైన్డ్ టెస్టు పెడ్తారు. ఆ టెస్టులో చాలా మంది పిల్లరయిపోతారు. ఐదుగురో, ఆరుగురో మిగుల్తారు. వాళ్ళకు వేరే టెస్టు వుంటుంది. అందులో ఎన్నికైన యిద్దరికి యిక్కడ ఉద్యోగా లిస్తారు."

ఆమె అతడివైపు నవ్వుతూ చూసింది.

"మిమ్మల్ని మరువడం కష్టం. మీరు చాలా సహాయ

పడుతున్నారు. నాకు ఏదేనా ఛాన్స్ వుంటుందంటారా?"

అతను నవ్వాడు. యువకుడు హుషారుగా, స్మార్టుగా వున్నాడు.

"ప్రశ్నలు ఒక్కటి చూసి ఛాన్స్ లేదనుకోకూడదు. మూడేళ్ళ క్రితం నేను యింటర్వ్యూకి వచ్చినపుడు 500 మంది కాండిడేట్స్ వున్నారు. మీలాగే నేను ఆంధ్రా నుంచి వచ్చాను, కాకినాడనుంచి. చివరకి ఉద్యోగం నాకొచ్చింది. అలా లక్ మీకూ రావచ్చు!"

"మీ మాటలు ఫలిస్తాయేమో, చూద్దాం" అని ఆమె ఖాళీ కుర్చీలో వెళ్ళి కూర్చుంది.

టెస్టులన్నీ పూర్తయినాయి. సరిగ్గా మూడింటికి లీల ప్రొప్రయిటర్ దస్తూర్ గదిలోకి వెళ్ళింది.

దస్తూర్ ముందున్న టేబులు మీద ఆరు టెలిఫోనులు వున్నాయి. అతని వయస్సు యాభై వుంటుంది. అతడు ఆమెకేసి నవ్వుతూ చూశాడు.

"మిస్ లీలా, నీకు జాబ్ యిస్తాం....వచ్చే నెల ఫస్టు నుంచి నువ్వు డ్యూటీలో చేరొచ్చు. అపాయింట్ మెంట్ ఉత్తరం నీ అడ్రెస్‌కు పోస్టులో పంపుతాం. కంగ్రాట్యులేషన్స్!" అన్నాడతను.

ఆమె నోటమ్మట మాట పెగల్లేదు. ఆమె హృదయం ఆనందంతో నిండి పోయింది. అమాంతంగా గాలిలో ఎగరాలనిపించిందామెకు.

"చాలా థాంక్స్ సార్" అందామె.

"ఈ సమయంలో నీకు ఒక సలహా యిస్తున్నాను. మా కంపెనీలో చేరినవాళ్ళు యావజ్జీవితం యిక్కడే వుండిపోతారు. మరో చోటకు వెళ్ళరు. ఇక్కడ చేరాక నువ్వు వేరే ఉద్యోగాలకోసం అన్వేషించకూడదు.

అందరికంటె మేం జీతాలు ఎక్కువగా యిస్తాం. అంతే కాదు. మా కంపెనీలో పనిచేసేవారికి అనేక సౌకర్యాలు మేం చేకూర్చుతాం."

"నేను మరోచోటకు వెళ్ళను సార్" అంది లీల.

"నీకు మేం ఫ్లాట్ యిస్తాం. మా వాన్‌లో నువ్వు ఆఫీసుకు రావచ్చు. అదే వాన్‌లో యింటికి వెళ్లొచ్చు. ఇదంతా నీకు మా ఉత్తరంలో తెలియజేస్తాం" అన్నాడతను.

"మీ కంపెనీలో ఉద్యోగం దొరకడం నా అదృష్టంగా భావిస్తున్నాను, సార్."

ఆనందమోహన్ గదిలోకొచ్చి అధిపతి పక్కకు వెళ్ళాడు.

"ఈ పిల్ల తప్ప తతిమ్మవాళ్ళు నాకు నచ్చలేదు. వాళ్ళను వెళ్ళిపోమను" అన్నాడు దస్తూర్.

"మిస్ మాణిక్యం మినిష్టర్ రికమెండేషన్‌లో వచ్చింది సార్" ఆనందమోహన్ జ్ఞాపకం చేశాడు.

దస్తూర్ నవ్వాడు.

"మిస్ మాణిక్యానికి ఉద్యోగం ఇవ్వడంకంటె మినిష్టర్‌కు డొనేషన్ యివ్వడం మంచిది" అన్నాడు దస్తూర్.

దస్తూర్‌కు నమస్కరించి లీల ఏర్‌కండిషండ్ గదిలోంచి బయటకు నడిచింది. ఆనందమోహన్ ముందు హాల్లో ఆమె దగ్గరకొచ్చాడు. యిద్దరూ బయటకు నడిచారు

"జయించారు, కాంగ్రాట్స్!" అన్నాడతను.

"నా గెలుపుకోసం మీరు చాలా పాటుపడి వుంటారు. మీకు నా ధన్యవాదాలు" అందామె.

అతడు నవ్వాడు.

"మా కంపెనీలో మెరిట్ కి విలువ ఎక్కువ ఇస్తారు దస్తూర్. మీ శక్తితో మీరు విజయాన్ని సాధించారు. నాకు చాలా సంతోషంగా వుంది" అంటూ అతడి విజిటింగ్ కార్డును ఆమె కిచ్చాడు.

కార్డును ఆమె హేండ్ బాగ్ లో పడేసుకుంది.

ఇద్దరూ రోడ్డమ్మట నడవసాగారు.

"మీరు ఎక్కడుంటున్నారు?"

"హోటల్ మిడ్ లాండ్ లో. రూమ్ నంబరు 20" అతడు ఆమెవంక చూశాడు.

"మిమ్మల్ని చూడగానే యీ ఉద్యోగం మీకు వస్తుందని నా కనిపించింది."

"ఎందుకలా అనుకున్నారు?"

"మీ మొహంలో ఏదో కళ వుంది. మీరున్నచోట లక్ష్మి నివశిస్తుందనిపిస్తోంది."

"బాగా పొగుడుతున్నారు" అందామె.

కొంతసేపు యిద్దరూ మౌనంగా నడిచారు.

"హోటల్ గదికి వచ్చి మిమ్మల్ని చూడొచ్చా?"

"నేను రాత్రి మెయిల్లో వెళ్ళిపోతున్నాను."

"స్టేషన్ దాకా వచ్చి మిమ్మల్ని సాగనంపుతాను"

"తప్పక రండి. ఎప్పుడొస్తారు?"

"ఆఫీసులో మరికొంత పనుంది. సరిగ్గా ఆరింటికి వస్తాను."

"మీ రాక కోసం ఎదురు చూస్తూ వుంటాను" అందామె.

ఆమెను బస్సు ఎక్కించి అతను తన ఆఫీసుకు వెళ్ళిపోయాడు.

లీల తన హోటల్ గదికి చేరుకునేసరికి నాలుగున్నర

కావస్తోంది. ఆనందంతో ఆమె పరుపు మీద వాలిపో యింది.

6

లీల తలుపు తెర్చింది. బయట నిలబడిన హోటల్ నౌఖరువైపు చూసింది.

"మీకోసం ఎవరో ఫోన్ చేశారు" అన్నాడతడు.

తనకోసం యెవరు ఫోన్ చేసి వుంటారు? ఆనంద మోహనా? ఆలోచిస్తూ ఆమె బయటకు వెళ్ళింది.

ముందు గదిలో వున్న ఫోన్ వద్దకు వెళ్ళి రిసీవర్ని అందుకుంది.

"హలో, లీల స్పీకింగ్! ఎవరు?"

"నేనమ్మా కాంతారావుని" అందో కంఠం.

"అంకుల్, మీరా!" అందామె ఆశ్చర్యంగా.

"ఏమిటమ్మా, అలా చేశావు? నా ఫ్రెండ్ రామ్మూర్తిని స్టేషన్‌కి పంపాను. అతను ఇక్కడకు తీసుకొస్తూంటే టాక్సీలోంచి దిగి ఎక్కడికో వెళ్ళిపో యావట! అతడొచ్చి నాముందు ఏడుస్తూ కూర్చున్నాడు. రాత్రంతా మాకు నిద్రలేదు. నీకోసం వెతుకుతూనే వున్నాం. నువ్వు ఆ హోటల్లో వున్నావని తెలిసి అక్కడకు ఫోన్ చేశాను."

"సారీ అంకుల్! నాకు ఎందుకో భయంవేసింది. అందుకే వెళ్ళిపోయాను."

"ఎందుకు భయం? ఇక్కడ నేనున్నానుగా?" అన్నా డతను.

"స్టేషన్‌కి మీ యిల్లు దగ్గరగా వుంటుందని అన్నయ్య చెప్పాడు. ఇరవై నిమిషాలు టాక్సీ వెళ్ళినా మీ యిల్లు రాలేదు. అందుమూలంగా నాకు అనుమానం వచ్చింది"

అందామె.

"లీలా, నేను ఇల్లు మారాను. అది మీకు తెలియదు. నేను జ్వరంతో పడున్నాను. నా ఫ్రెండ్‌ను పంపాను."

"ఐయామ్ సారీ, అంకుల్!"

"అయిందేదో అయిపోయింది. నా ఫ్రెండ్ కారు నీకు పంపుతున్నాను. నువ్వు వెంటనే యిక్కడకు రా!"

"ఇప్పుడు నేను రాలేను, అంకుల్! ఆరు గంటలకు నాకు పనుంది" అందామె.

"లీలా, ఇప్పుడు ఐదు కావస్తోంది. నేను పంపిన కార్లో వెంటనే వచ్చేయి. ఆరులోపల నిన్ను హోటల్‌కి పంపేస్తాను. నువ్వు వస్తేగాని నాకు నిద్రపట్టదు!"

"మీ యిల్లు ఎక్కడుంది?"

"నార్త్ జగనాధ నగర్, స్ట్రీట్ నంబర్ 9, బిల్డింగ్ నంబర్ 95. ఇది నా కొత్త అడ్రెసు."

"అలాగే వస్తాను, అంకుల్" అందామె.

"కారు యిప్పుడే బయల్దేరింది. కాస్సేపట్లో అక్కడికొస్తుంది. దానిలో కూర్చుని వెంటనే వచ్చేయి."

"తప్పక వస్తాను" అందామె.

"లీలా, నీ రాకకోసం ఎదురు చూస్తూ వుంటాను" అని అతడు రిసీవర్ని పెట్టేశాడు.

ఆమె రిసీవర్ని పెట్టేసింది. అప్పుడే ఒకతను ముందు హాల్లోకి వచ్చాడు.

"ఇక్కడ లీల అనే యువతి ఎవరేనా వున్నారా?" అడిగాడతను.

ఆమె అతడి ముందుకు వెళ్ళింది.

"లీల నేనే" అందామె.

"మీకోసం కాంతారావుగారు కారు పంపారు"

అన్నాడతను.

ఆమె బయటకు వెళ్ళి కారువైపు చూసింది. కారు నంబర్ని గుర్తుంచుకుంది. హాల్లోకొచ్చి టైమ్ చూసింది. 5-15 అయింది. ఆరింటికి ఆనందమోహన్ వస్తానన్నాడు. అతడికి ఫోన్ చేయడం మంచిదేమో!

ఆమె టెలిఫోను డైరెక్టరీ చూసింది. మోడర్న్ యింజనీరింగ్ కంపెనీ నంబర్ కి ఫోన్ చేసింది.

"హలో!" అందో స్త్రీ కంఠం.

"హలో, మిష్టర్ ఆనందమోహన్ తో మాట్లాడాలి" అందామె.

కాస్సేపట్లో ఆమెకు కనెక్షన్ వచ్చింది.

"హలో, ఆనందమోహన్!" అన్నాడతను.

"నేను, లీలని!" అందామె.

"మీరు నాకు ఫోన్ చేసినందుకు సంతోషిస్తున్నాను. చెప్పండి" అన్నాడతను.

"నేను అంకుల్ కాంతారావు యింటికి వెళ్తున్నాను. అతను నార్త్ జగన్నాథ నగర్ లో వున్నాడు. 9వ స్ట్రీట్, నంబర్ 95 యిల్లు. అతడు నాకోసం ఫియట్ కారు పంపాడు. కారు నంబర్ TMX 3006. ఆరు గంటల లోపల నేను రావడానికి ప్రయత్నిస్తాను. ఆలస్యమైనా మీరు వెళ్ళిపోకండి. నేను వచ్చినదాకా వుండండి" అందామె.

"లీలా, అక్కడకు వెళ్ళక తప్పదా?" అడిగాడతను.

"వెళ్ళితీరాలి" అందామె.

"లీలా, వెళ్ళిరండి. మీరు వచ్చినదాకా మీ హోటల్లో వేచివుంటాను."

"థాంక్స్" అని ఆమె రిసీవర్ని పెట్టేసింది.

ఆమె వెళ్ళి తన గదికి తాళం వేసింది. బయటకు నడిచి ఫియట్ కార్లో ఎక్కింది. డ్రయివర్ కారును వేగంగా పోనిచ్చాడు.

7

గేటు దాటి కాంపౌండులోకి ప్రవేశించింది. పోర్టికో కింద కారు ఆగింది. తలుపు తెరిచి ఆమె కిందకు దిగింది.

వరండాలో రామ్మూర్తి నిలబడి వున్నాడు.

"మీరా? కాంతారావుగారు ఏరీ?" అందామె.

"రామ్మా, ఆయన లోపల వున్నారు" అన్నాడతను.

ఆమె లోపలకు వెళ్ళింది.

"ఆయన ఆరోగ్యం బాగాలేదు. ఆయన ఆ గదిలో వున్నారు" అన్నాడు రామ్మూర్తి.

ఆమె ఆత్రంగా ఆ గదిలోకి వెళ్ళింది. గదిలో ఎవ్వరూ లేరు. ఆమె తృళ్ళిపడింది. వెనక్కి తిరిగింది. గుమ్మంలో రామ్మూర్తి నిలబడి వున్నాడు.

"కాంతారావుగారు యిక్కడలేరే?" అందామె.

రామ్మూర్తి గంభీరంగా నవ్వాడు. తలుపులు మూశాడు. ఆమెవైపు తీక్షణంగా చూశాడు.

"లీలా, నన్ను మోసంచేసి పారిపోయావు! నిన్ను మోసంచేసి యిక్కడకు రప్పించాను" అన్నాడతను.

ఆమె గుండె దడదడలాడింది. అతడివంక ఆమె సూటిగా చూసింది.

"నీకేం కావాలి?" అందామె.

"నువ్వు కావాలి! నీ అందం కావాలి" అన్నాడతను.

"నేను యిక్కడకు వచ్చినట్లు ఆనందమోహన్‌తో చెప్పాను. నేను హోటల్‌కి తిరిగి వెళ్ళకపోతే అతడు వూరుకోడు. పోలీసులతో ఇక్కడకు వస్తాడు" అందామె.

అతడు పిశాచంలా నవ్వాడు.

"అతడు యిక్కడకు రాలేదు. నేను నీకు యిచ్చిన అడ్రెస్ యీ యింటిదికాదు!"

"లయ్యర్!" అర్చిందామె.

అతడు ఆమెవైపు విషపూరితమైన నవ్వుతో చూశాడు.

"లీలా, నువ్వు నా అతిధివి! నీకు కావలసినవన్నీ నేను సమకూరుస్తాను. నువ్వు మళ్ళా హోటల్ కి వెళ్ళవు!"

"ఇక్కడే వుంటూగా?" ప్రశ్నించిందామె.

"ఎక్కడకు వెళ్తావో నాకు తెలియదు. గుడ్ నైట్!" అని అతడు వెళ్ళిపోయాడు.

తలుపు మూయబడింది. అటువైపునుంచి తాళం వేసినట్లు ఏదో చప్పుడైంది.

గదిలో లైటు వెల్గుతోంది. ఏడుస్తూ లీల మంచం మీద వాలిపోయింది.

8

ఆనందమోహన్ సరిగ్గా ఆరింటికి ఆమె హోటల్ కి చేరుకున్నాడు. ఇరవై నంబరు గదికి వెళ్ళి అతను చూశాడు.

గదికి తాళంవేసివుంది. అతను ముందు హాల్లో వున్న సోఫాలో కూర్చున్నాడు. సిగరెట్ పీలుస్తూ ఆమెకోసం చూస్తూ వుండిపోయాడు.

టైమ్ ఎనిమిది దాటింది. అయినా ఆమె రాలేదు. అతడు విసుగ్గా లేచాడు. ఆమె ఇంకా ఎందుకు రాలేదు?

మరి కొంతసేపు ఆమె రాకకోసం అతను చూశాడు. ఎంతసేపు చూసినా ఆమె రాలేదు. ఆమె తన అంకుల్ శాంతారావు యింట్లో వుండొచ్చు!

ఆనందమోహన్ బయటకు నడిచాడు. తన స్కూటర్ని

నారు జగన్నాథ నగర్ వైపు పోనిచ్చాడు.

పట్నానికి దూరంగా వుంది ఆ నగర్. తొమ్మిదవ వీధమ్మట స్కూటర్ని పోనిస్తూ అతడు 95 నంబరు ఇంటి ముందు ఆపి, కిందకు దిగాడు.

స్కూటర్ చప్పుడు విని ఆ యింట్లోని మనిషి గేటు దగ్గరకు వచ్చాడు. ఆనందమోహన్ అతడికేసి చూశాడు.

"కాంతారావు యిక్కడ వుంటున్నారా?" అడిగాడతను.

"ఆ పేరుతో ఇక్కడ ఎవ్వరూ లేరు" అన్నాడా మనిషి.

ఆనందమోహన్ మేడవైపు చూశాడు.

"ఈ మేడ ఎవరిది?"

"నాదే. నా పేరు ఆల్మాగం. పైనా, కిందా నేనే వుంటున్నాను. నేనెవరికీ అద్దెకివ్వలేదు" అన్నాడతను.

ఆనందమోహన్ ఇంటి నంబర్ మళ్ళా చూశాడు. 95! సందేహంలేదు. ఆమె ఇక్కడకు రాలేదు. కాంతారావు ఇల్లు ఇదికాదు. ఆమె యీ అడ్రెసు తనకు ఎందుకిచ్చింది?

లీల తనకు రాంగ్ అడ్రెస్ ఇవ్వదని అతని విశ్వాసం. ఈ అడ్రెస్ యెవరో ఆమెతో చెప్తే ఆమె తనతో చెప్పిందా?

కాంతారావు ఎక్కడుంటున్నాడు? ఈ అడ్రెస్ ఆమెతో చెప్పి కాంతారావు ఆమెను మరెక్కడికో తీసుకువెళ్ళాడా? ఆనందమోహన్ ఆలోచిస్తూ స్కూటర్ దగ్గరకు నడిచాడు.

సిగరెట్ వెలిగించి ఆలోచిస్తూ నిలబడ్డాడు. కాంతారావు అడ్రెసు, అతడు పంపిన కారు నంబరు ఆమె

అతడికిచ్చింది. అతన్నీ ఎందుకిచ్చింది? లోలోపల అను మానపడూ ఆమె ఆ కారులో వెళ్ళిందా?

అతడు స్కూటర్ని స్టార్టు చేసి పోనిచ్చాడు. ఈ పాటికి ఆమె హోటల్ కి వచ్చి వుంటుందేమో! అతడు స్కూటర్ని వేగంగా ఆమె హోటల్ కి పోనిచ్చాడు.

స్కూటర్ దిగి ముందు హాల్లోకి వెళ్ళాడు. కౌంటర్ వెనకనున్న గుమస్తా వెపు చూశాడు.

"లీల తన గదికి వచ్చిందా?" అడిగాడు.

"ఇంకా రాలేదు, సార్" అన్నాడు గుమస్తా.

ఆ వార్త వినగానే అతడి గుండె దడదడ కొట్టుకుంది. అతడు టైమ్ చూశాడు. పది దాటింది. రాత్రి ట్రెయిన్ లో తన ఊరుకు వెళ్తానని ఆమె తనతో చెప్పింది. కాని ఆమె వెళ్ళలేదు. ఆమె ఎందుకు వెళ్ళలేదు? తనని రమ్మని ఆమె గదిలో ఎందుకు లేదు?

ఆమె ఏదో ఆపదలో యిరుక్కుని వుండాలి. ఆనంద మోహన్ కౌంటర్ ముందుకు వెళ్ళి గుమస్తా వంక చూశాడు.

"లీలకోసం ఎవరొచ్చారు?"

"ఎవరో ఆమెతో ఫోన్ లో మాట్లాడారు. తర్వాత కారు వచ్చింది. డ్రయివర్ తో బయటకు వెళ్ళి ఆమె కారెక్కింది."

"వెళ్ళేటప్పుడు ఆమె మొహం ఎలా వుంది? నవ్వుతూ వుందా?"

"ఆమె మొహంలో నవ్వు లేదు. విచారమూ లేదు. ఏదో ఆలోచిస్తున్నట్లు వుంది" అన్నాడు గుమస్తా.

"కారు రాగానే ఆమె వెళ్ళిపోయిందా?" అడిగాడు ఆనందమోహన్.

"ఆమె ఫోన్ చేసి ఎవరితోనో మాట్లాడింది, సార్,

తర్వాత ఆమె కారులో వెళ్ళిపోయింది."

ఆమె తనకు ఫోన్ చేసింది. ఆలోచిస్తూ ఆనందమోహన్ సిగరెట్ వెలిగించాడు. పొగ పీల్చి వదుల్తూ తన స్కూటర్ వైపు నడిచాడు.

ఇంటర్వ్యూకి వచ్చిన లీలతో మాట్లాడాక ఆమె అప్లికేషన్ మరోసారి చూశాడతను. ఆమె విజయవాడ అడ్రెస్ ముద్రించినట్లు అతడి మెదడులో నిల్చిపోయింది. ఆమె యింటికి టెలిగ్రామ్ యివ్వడం మంచిదేమో! టెలిగ్రాం ఇస్తే అక్కడివాళ్ళు ఖంగారు పడ్తారు.

మద్రాసుకు ఒంటరిగా వచ్చిన యువతి కాంతారావు బాగా తెలిసేగాని అతడింటికి వెళ్ళదు. కాంతారావు బాగా తెలిస్తే ఆమె హోటల్లో గది ఎందుకు తీసుకుంది?

స్కూటర్ని అతడు పోనిచ్చాడు. రోడ్డు లైట్లు వెల్గుతున్నాయి. అతడు మెల్లిగా స్కూటర్ని పోనిస్తున్నాడు. లీలకోసం అతడి కళ్ళు వెతుకుతున్నాయి. కాని ఎక్కడా ఆమె అతడికి కనబడలేదు. పన్నెండు తర్వాత అతడు మళ్ళా ఆమె హోటల్కు చేరుకున్నాడు.

ముందు హాల్లో ఎవ్వరూ లేరు. హోటల్ బయట వాచ్మన్ పచార్లు చేస్తున్నాడు.

ఆనందమోహన్ ఆమె గదివైపు వెళ్ళాడు. తలుపుకు తాళంవేసి వుంది. ఆమె యింకా రాలేదు!

అతడు బయటకు కదిలాడు. పన్నెండు దాటింది. ఈ రాత్రి తను ఏమీ చేయలేదు. ఆ కారు యొవరిదో కనుక్కోవాలి!

ఆనందమోహన్ తన గదికి వెళ్ళిపోయాడు. తిండి తిన బుద్ధి కాలేదు. రాత్రంతా జాగారంచేస్తూ అతడు గడిపేశాడు.

పొద్దుటే హోటల్ మిడ్‌లాండ్‌కి ఫోన్ చేశాడు.

"హల్లో, హోటల్ మిడ్‌లాండ్" అందో కంఠం.

"హల్లో, 20 నంబరు గదిలో వుండే లీల వచ్చిందా?" ప్రశ్నించాడు.

"ఆమె రాలేదు సార్. కాని ఒకతను వచ్చాడు. మాకు రావలసిన డబ్బు చెల్లించి గది ఖాళీచేసి, ఆమె ఏర్‌బాగ్ తీసుకొని వెళ్ళిపోయాడు" అన్నాడు గుమస్తా.

"అతడు ఏమైనా చెప్పాడా?"

"ఆమె యివాళ వాళ్ళ ఊరుకు వెళ్తోందట"

"అతని పేరు చెప్పాడా?"

"కాంతారావు."

కాంతారావు! ఆనందమోహన్ ఉలిక్కిపడ్డాడు. లీల విజయవాడ వెళ్ళిపోయిందా? అంతా అగమ్యగోచరంగా వుంది.

ఆనందమోహన్ కుర్చీలో కూర్చుని ఆలోచించసాగాడు. ఆమెను గురించి తనింతగా బాధపడ్డం అనవసరమేమో!

ఆమె యింటర్‌వ్యూకి వచ్చింది. తర్వాత తను వస్తానంటే గదికి రమ్మంది. ఆమెతో తనకంతగా పరిచయం లేదు. ఆమెను గురించి తను యింతగా దిగులుపడ్డం వృథా అనిపించింది.

కాని ఎంత ప్రయత్నించినా లీల రూపం అతడి మెదడులోంచి తొలగిపోవడంలేదు. ఆమెను మొదటిసారి చూడగానే తన హృదయంలో ఏదో జ్యోతి వెలిగినట్లు అనిపించింది. ఆమెను అతడు మర్చిపోవడం కష్టమేమో!

ఆనందమోహన్ తనఆఫీసుకు చేరుకున్నాడు. తను చేయ గలిగింది ప్రస్తుతం ఏమీ లేదు. త్వరలో వచ్చి తన ఉద్యో

గంలో చేర్చుంది. జరిగినదంతా అప్పుడు ఆమే చెప్తుంది.

తన పనిలో అతడు నిమగ్నుడై పోయాడు. కంపెనీ టెలిఫోన్‌లు రెండు అతడి టేబులు మీద వున్నాయి. టెలిఫోన్ మ్రోగింది. అతడు రిసీవర్ని ఎత్తాడు.

"మోడర్న్ యింజనీరింగ్ కంపెనీ!" అన్నాడతను.

"హలో, నేను విజయవాడనుంచి మాట్లాడుతున్నాను. నా పేరు రామరాజు. నా చెల్లెలు లీల స్టెనో టైపిస్టు ఉద్యోగంకోసం ఇంటర్‌వ్యూకి అక్కడికి వొచ్చింది. ఆమె నిన్న రాత్రే బయలుదేరి యిక్కడకు రావాలి. కాని ఆమె రాలేదు. నాకు చాలా గాభరాగా వుంది సార్"

"రామరాజు గారూ, లీల యింటర్‌వ్యూకి వచ్చింది. గుడ్ న్యూస్, ఆమెకు ఉద్యోగం వచ్చింది, మా కంపెనీలో. ఆమె మద్రాసులో వున్న కాంతారావు ఇంటికి వెళ్ళిందని విన్నాను" అన్నాడు ఆనందమోహన్.

"అయితే ఫరవాలేదు! వాడు దాన్ని రెండుమూడు రోజులు వుండమని వుంటాడు."

"కాంతారావు అడ్రెస్ చెప్తారా?"

"నంబర్ 10, చిన్నతంబీ స్ట్రీట్, ట్రిప్లికేన్. మీరు లీలను కలుసుకుంటే నేను ఫోన్ చేసినట్లు చెప్పండి. తొందరగా వచ్చేయమనండి. అమ్మ బెంగ పెట్టుకుంది."

"అలాగే చెప్తాను."

"తమ పేరు?"

"ఆనందమోహన్! మీరు యిచ్చిన అడ్రెసుకు వెళ్ళి ఆమెకు అంతా చెప్తాను. అవుసరమైతే నేను మీకు ఫోన్ చేయవచ్చా?"

"పొద్దుట 9 నుంచి సాయింత్రం 5 దాకా నేను ఆఫీసులో వుంటాను సార్. మాది కృష్ణా కెమికల్స

కంపెనీ. మీరు యెప్పుడు కావలసినా నాకు ఫోన్
చేయవచ్చు. అకౌంటెంట్ రామరాజు అని అడగండి"
అని అతడు రెండు టెలిఫోన్ నెంబర్లు యిచ్చాడు.

ఆ నంబర్లను ఆనందమోహన్ తన డైరీలో రాసు
కున్నాడు.

"ఆనందమోహన్ గారూ, ఇంత స్నేహ భావంతో
మాట్లాడినందుకు మీకు నా ధన్యవాదాలు. మిమ్మల్ని
ఎప్పుడో అప్పుడు కల్సుకుంటానని ఆశిస్తున్నాను."

"దానికేముంది సార్! మీ చెల్లెలు ఇక్కడ ఉద్యో
గంలో చేరుందిగా, అప్పుడు మిమ్మల్ని చూసే అవకాశం
నాకు లభిస్తుంది."

"వుంటాను, సార్" అని రామరాజు రిసీవర్ని
పెట్టేశాడు.

ఆనందమోహన్ వుషారుగా కుర్చీలోంచి లేచి
బయటకు నడిచాడు. తన స్కూటర్ని ట్రిప్లికేన్ వైపు
వుషారుగా పోనిచ్చాడు.

ఆమె బ్రహ్మాండంగా నాటకమాడి తనని ఫూల్
చేసింది. ఆరింటికి రమ్మని ఎక్కడికో పోయింది. ఏదో
కారు నంబరూ, రాంగ్ అడ్రెసూ యిచ్చి అతడికి నిద్ర
లేకుండా చేసింది.

కాంతారావు యింటి ముందు తన స్కూటర్ ఆగ్గానే
ఆమె తృళ్ళిపడుతుంది. ఆ అడ్రెసు తనకెలా తెలుసా అని
ఆమె ఆశ్చర్యపోతుంది. ఆనందమోహన్ తన స్కూటర్ని
వేగంగా పోనిచ్చాడు.

9

మెయిన్ రోడ్డు మీదనుంచి ఎడంవైపునున్న చిన్న
తంబూ స్ట్రీట్లోకి స్కూటర్ని అతను పోనిచ్చాడు.

పదో నంబరు ఇంటిముందు స్కూటర్ ఆపి ఆనందమోహన్ కిందకు దిగాడు.

పాతబడిన యిల్లు. ముందు మెట్లెక్కి అతను వరండా మీదకు వెళ్ళాడు. హాల్లోకి చూస్తూ అతను బయట నిల బడ్డాడు. తలుపు మీద తట్టాడు. తువ్వాలు చుట్టుకుని ఒకతను హాల్లోకొచ్చి అతడి వంక చూశాడు.

"కాంతారావుగారి యిల్లు యిదేనా?"

"ఇదే సార్. కాంతారావు నేనే" అన్నాడతను.

ఆనందమోహన్ చూపు లోపలకు వెళ్ళింది. లీల లోపల గదుల్లో వుండి వుండాలి!

"లీల యిక్కడే వుందిగా?"

కాంతారావు నల్ల మొహం ఆశ్చర్యంగా అతడివైపు చూసింది.

"లీల ఇక్కడకు రాలేదే! అది మద్రాసు వచ్చిందా? రామరాజు ఉత్తరం కూడా రాయలేదే!"

ఆనందమోహన్ గుండె దడదడ కొట్టుకుంది. ఆమె తనతో నాటకం ఆడలేదు. ఏదో మోసం జరిగింది.

"కాంతారావుగారూ, లీల మీ ఇంట్లో వుంటుందని రామరాజు ఫోన్ చేసి నాతో చెప్పారు."

"అది ఇక్కడకు రానేలేదు. అంతా విచిత్రంగా వుంది" అన్నాడు కాంతారావు.

"నేను చెప్పేది జాగ్రత్తగా వినండి. నేను మోడర్న్ ఇంజనీరింగ్ కంపెనీలో పనిచేస్తున్నాను. మా కంపెనీలో ఇంటర్వ్యూకి లీల నిన్న వచ్చింది. హోటల్ మిడ్ లాండ్‌లో ఆమె గది తీసుకొని వుంది...."

"నేనిక్కడుండగా ఆమె హోటల్లో గది యెందుకు

తీసుకుంది?"

"అదంతా ప్రస్తుతం నాకు తెలియదు. నిన్న సాయంత్రం 6 గంటలకు ఆమె నన్ను తన హోటల్ గదికి రమ్మంది. నే వెళ్ళేసరికి ఆమెలేదు. కాంతారావు ఆమెకు ఫోన్ చేసి కారు పంపాడు. ఆ కారులో వెళ్ళిపోయింది. ఆ కారులో వెళ్ళేముందు ఆమె నాకు ఫోన్ చేసింది. ఎక్కడకు వెళ్తున్నదీ, ఏ కారులో వెళ్తున్నదీ ఆమె నాకు చెప్పింది."

"ఎవడా కాంతారావు? వాడి అడ్రెస్ ఎక్కడ?"

"అతడిచ్చిన అడ్రెస్‌కు నేను వెళ్ళి చూశాను. అక్కడ కాంతారావు అనేవాడు లేడు."

"గుడ్ గాడ్!" అరిచాడు కాంతారావు.

"మీ పేరుతో యెవరో ఫోన్ చేసి, కారు పంపి ఆమెను తీసుకుపోయారు. ఆమె ఏమైందో మనం కనుక్కోవాలి!"

కాంతారావు విచారవదనంతో అతడివైపు చూశాడు.

"రామరాజుకి చెల్లెలంటే ప్రాణం. మనం ఏదో వెంటనే చెయ్యాలి" అని అతడు లోపలకు పరుగెత్తాడు.

కాస్సేపట్లో పాంటు, స్లాక్ ధరించి అతడు హాల్లోకొచ్చాడు. ఆనందమోహన్ హాల్లో పచార్లు చేస్తున్నాడు.

"పదండి, వెళ్దాం" అన్నాడు కాంతారావు.

ఇద్దరూ బయటకు నడిచారు. ఆనందమోహన్ స్కూటర్ని తన ఆఫీసుకు పోనిచ్చాడు. వెనుక సీటుమీద కాంతారావు కూర్చున్నాడు.

ఆఫీసు చేరుకోగానే కాంతారావును ఒక కుర్చీలో కూర్చోమని ఆనందమోహన్ తన బాస్ ఏర్‌కండిషండ్ గదిలోకి వెళ్ళాడు.

దస్తూర్ అతడివైపు నవ్వుతూ చూశాడు.

"సార్, నిన్న మీరు సెలక్టు చేసిన అమ్మాయి లీలను యెవరో ఎత్తుకుపోయారు!" అన్నాడతను.

దస్తూర్ ఆశ్చర్యపోయాడు. అంతా ఆనందమోహన్ వివరంగా చెప్పాడు.

"ఆనంద్, నేను సెలక్టు చేసిన నిమిషంనుంచీ ఆమెను మన కంపెనీ స్టాఫ్ మెంబరుగానే భావించాలి. ఆమె మాయమైతే మనకు అమర్యాద. ఎంతైనా ఖర్చుపెట్టు! ఆమె ఏమైందో కనుక్కో" అన్నాడు దస్తూర్.

"అలాగే సార్!" అన్నాడు ఆనందమోహన్.

"కావలసినచోట నా పేరు ఉపయోగించు! తొందరగా పనిలోకి దిగు" అని దస్తూర్ అతడిని తరిమేశాడు.

10

తన ఆఫీసు కుర్చీలో కూర్చుని ఆనందమోహన్ విజయవాడకు ఎస్.టి.డి. కాల్ చేశాడు.

"కృష్ణా కెమికల్స్ కంపెనీ! అందో కంఠం అటువైపునుంచి.

"నేను మద్రాసునుంచి ఫోన్ చేస్తున్నా. మీ అకౌంటెంట్ రామరాజుగారితో మాట్లాడాలి."

కాస్సేపట్లో రామరాజు అటువైపున వచ్చాడు.

"హలో రామరాజు స్పీకింగ్!"

"నేను ఆనందమోహన్! మీ ఫ్రెండ్ కాంతారావుగారు నా ముందు వున్నారు. లీల ఆ ఇంట్లో లేదు. ఏమైందో కనుక్కోడానికి ప్రయత్నిస్తున్నాం."

"హలో, లీల ఏమైంది? ఏదీ దాచకుండా చెప్పండి!" అరిచాడతను గాభరాగా.

"రామరాజుగారూ, ఖంగారు పడకండి! ఆమెను ఎవరో ఎత్తుకుపోయారని అనుమానంగా వుంది. ఇక్కడకు ఆమె వచ్చేటప్పుడు ట్రెయిన్‌లో యెవరితోనైనా పరిచయం అయిందా?"

"కోకిల అనే నర్స్ లీలకు సీటు ఇచ్చింది. కోకిల గాబ్రిల్ సర్జికల్ క్లినిక్‌లో నర్స్‌గా వుంటోంది. ఆ క్లినిక్ ఎగ్మూర్‌లో వుంది" అన్నాడు రామరాజు.

"అక్కడకు లీల వెళ్ళిందేమో చూస్తాను."

"ఇవాళే బయల్దేరి నేను మద్రాస్ వస్తున్నాను. మీ కంపెనీకొచ్చి మిమ్మల్ని కల్సుకోనా?"

"రండి" అన్నాడు ఆనందమోహన్.

అతడి చేతిలోని రిసీవర్ని కాంతారావు తీసుకున్నాడు.

"రామరాజూ, కాంతారావుని! నాకు ఉత్తరం రాయకుండా లీలను ఇక్కడకు ఎందుకు పంపావు?"

"నీకు రాశానురా! అంది వుండదు!"

"నువ్వు వెంటనే వచ్చేయి. అందరం కలిసి దాని కోసం వెతుకుదాం" అన్నాడు కాంతారావు.

"వెంటనే బయల్దేరి వస్తున్నా."

కాంతారావు రిసీవర్ని ఆనందమోహన్‌కి యిచ్చాడు. మరికొంతసేపు మాట్లాడి అతడు రిసీవర్ని పెట్టేశాడు.

పోలీసు డిపార్టుమెంట్‌లో వున్న యిన్‌స్పెక్టర్ రాజన్‌కి ఆనందమోహన్ ఫోన్ చేశాడు.

"నేను ఆనందమోహాన్ని!"

"ఏం కావాలో చెప్పండి" అన్నాడు యిన్‌స్పెక్టర్ రాజన్.

"TMX 3006 ఫియట్ కారు ఎవరిదో కనుక్కొని నాకు చెప్పండి. ఐ విల్ బి గ్రేట్‌ఫుల్!"

"కనుక్కొని మీకు ఫోన్ చేస్తాను."

"చాలా థాంక్స్" అని ఆనందమోహన్ రిసీవర్ని పెట్టేశాడు.

అతడు కుర్చీలోంచి లేచాడు. అతనూ, కాంతారావూ బయటకు నడిచారు.

"లీల గురించి పోలీసు రిపోర్టు ఇవ్వడం మంచిదేమో, సార్" అన్నాడు కాంతారావు.

"ఇద్దాం, యిచ్చేముందు కోకిలను కల్సుకుని మాట్లాడాలి" అన్నాడు ఆనందమోహన్.

హోల్స్ రోడ్డులో వున్న గాబ్రియల్ సర్జికల్ క్లినిక్ కాంపౌండులో స్కూటర్ ఆపి ఆనందమోహన్, కాంతారావు దిగారు.

ఇద్దరూ లోపలకు వెళ్ళారు. టెలిఫోన్ పక్కన కూర్చున్న ఒక నర్స్ వాళ్ళవైపు చూసింది.

"నర్స్ కోకిల వున్నారా?" అడిగాడు ఆనంద మోహన్.

"అలా కూర్చోండి. ఆమె డాక్టర్ గదిలో వున్నారు. కాస్సేపట్లో వస్తారు" అందామె.

కుర్చీల్లో వాళ్ళిద్దరూ కూర్చున్నారు. ఒక నర్స్ హాల్లోకి వచ్చింది.

"వాళ్ళు మీకోసం వచ్చారు" అంది మొదటి నర్స్.

నర్స్ కోకిల వాళ్ళ దగ్గరగా వెళ్ళింది. నవ్వుతూ వాళ్ళవైపు చూసింది.

"నా పేరు ఆనందమోహన్."

"నా పేరు కాంతారావు."

కాంతారావువైపు ఆమె సూటిగా చూసింది.

"ఆ రోజు మీరు స్టేషన్‌కి రాలేదు. లీల చాలా

భయపడింది. మీ ఫ్రెండ్ రామ్మూర్తి వచ్చేసరికి ఆమె సంతోషించింది" అందామె.

"రామ్మూర్తిని నేను పంపలేదు!" అన్నాడు కాంతారావు.

"లీల ఎలా వుంది?" అడిగిందామె గాభరాగా.

"లీల మాయమైంది. మీ సహాయం మాకు కావాలి. ఆ రామ్మూర్తి ఎలా వుంటాడు? అతడిని మళ్ళీ చూస్తే పోల్చగలరా?" అడిగాడు ఆనందమోహన్.

"రామ్మూర్తి పొట్టిగా, పచ్చగా, సన్నంగా వుంటాడు. పంచ, జుబ్బాతో వున్నాడు. నుదురు మీద ఎర్రటి బొట్టు! అతడి అసలు పేరు రామ్మూర్తి కాకపోవచ్చు" అందామె.

"డాంగ రాస్కెల్!" అర్చాడు కాంతారావు.

"అతడిమీద అనుమానం వచ్చింది. లీలతో పరిచయం లేని మనిషిని కాంతారావుగారు స్టేషన్‌కి పంపరని భావించి అతడిని పరీక్షించి చూశాను. కావలిస్తే నన్నూ తనతో కాంతారావు ఇంటికి రమ్మన్నాడు. దానితో వదిలేశాను" అందామె.

"ఆరితేరినవాడై వుండాలి!" అన్నాడు ఆనందమోహన్.

నర్స్ కోకిలకు థాంక్స్ చెప్పి వాళ్ళు బయటకు నడిచారు. ఆనందమోహన్ తన స్కూటర్ని ఇన్‌స్పెక్టర్ రాజన్ ఆఫీసువైపు పోనిచ్చాడు.

ఇన్‌స్పెక్టర్ రాజన్ వాళ్ళిద్దర్నీ కూర్చోమన్నాడు.

"ఆనందమోహన్ గారూ, మీరు అడిగింది కనుక్కున్నాను. ఆ నంబరున్న ఫియట్ కారు సుందరంగారిది" అని ఒక చీటీని యిచ్చాడు.

"అన్నీ వివరాలూ అందులో రాశాను" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

చీటీలో రాసింది చదివి ఆనందమోహన్ కుర్చీలోంచి లేచాడు. ఇన్‌స్పెక్టర్ రాజన్‌కి ధన్యవాదాలు అర్పించి బయటకు నడిచాడు. వెనకనే వెళ్ళాడు కాంతారావు.

విశాలమైన కాంపౌండులో స్కూటర్ ఆగింది. ఆనందమోహన్, కాంతారావు దిగారు. సమీపంలో అర డజను కారు షెడ్లు వున్నాయి. అందులో ఫియట్, అంబాశిడర్ కార్లు వున్నాయి.

ముందు హాల్లోకి వెళ్ళాడు ఆనందమోహన్. "సుందరం గారితో మాట్లాడాలి" అన్నాడతను రిసెప్షన్ గుమస్తాతో.

అతడు ఒక గదివేపు చెయ్యి చూపించి వెళ్ళమన్నాడు. ఆనందమోహన్, కాంతారావు ఆ గదిలోకి వెళ్ళారు.

సుందరం పొట్టిగా, నల్లగా వున్నాడు. మెళ్ళో బంగారం గొలుసు మెరుస్తోంది.

"ఏం కావాలి మీకు?" అడిగాడతను.

"నిన్న సాయంత్రం 5 ప్రాంతంలో మీ ఫియట్ కారు హోటల్ మిడ్‌లాండ్‌కు వెళ్ళిందా?"

"లేదు. నా దగ్గర ఒకే ఫియట్ కారుంది. అందులో నేనూ, నా భార్యా నిన్న బీచ్‌కి వెళ్ళాం" అన్నాడు సుందరం.

"TMX 3006 ఫియట్ కారు హోటల్ మిడ్‌లాండ్‌కి వెళ్ళింది" అన్నాడు ఆనందమోహన్ గంభీరంగా.

"ఆ నంబరు తగిలించుకుని మరో ఫియట్ కారు అక్కడకు వెళ్ళిందేమో!" అని సుందరం నవ్వాడు.

ఆనందమోహన్ లేచాడు.

"సారీ, పొరబడి వుంటాం" అన్నాడు.

ఇద్దరూ బయటకు నడిచారు. కాంతారావును స్కూటర్ దగ్గర వుండమని ఆనందమోహన్ షెడ్లవైపు వెళ్ళాడు.

అక్కడ ఆ క్షణంలో యెవరూ లేరు. ఫియట్ కారు తలుపు తెరిచి అతను లోపలకు పరీక్షగా చూశాడు. వెనుక సీటుముందు, కాళ్ళు పెట్టుకునే రబ్బర్ మేట్ పైన ఎర్రటిగాజు కనిపించింది. దాన్ని తీసి జేబులో పడేసుకున్నాడు.

లీల కుడిచేతికున్న ఎర్రటిగాజులు అతడికి గుర్తొచ్చాయి!

అతడు కారు నంబరు మరోసారి చూసి వేగంగా స్కూటర్ వైపు నడిచాడు.

"సుందరం గదిలోకి మళ్ళా వెళ్ళాలి, రండి" అన్నాడు.

ఇద్దరూ వేగంగా లోపలకు నడిచి సుందరం గదిలోకి దూసుకెళ్ళారు.

కాంతారావు యెదురుగా కూర్చున్నాడు. ఆనంద మోహన్ అతడి పక్కకు వెళ్లాడు.

"సుందరం, నీ ఫియట్ కారు మిడ్‌లాండ్ హోటల్‌కి వెళ్ళింది. ఒక యువతిని మీ డ్రయివర్ కారులో ఎక్కించి తీసుకుపోయాడు!" ఆనందమోహన్ గద్దించాడు.

"అక్కడకు మా కారు వెళ్ళలేదని యెన్నిసార్లు చెప్పాలి?" అర్చాడతను.

"ఆమె చేతికుండే యీ ఎర్రగాజు మీ ఫియట్ కారు మేట్ మీద పడుంది!" అని ఎర్రగాజును పైకితీసి పట్టుకున్నాడతను.

"అటువంటి ఎర్ర గాజులు మన దేశంలో అనేకమంది స్త్రీల చేతులకుంటాయి" అన్నాడు సుందరం.

అతడి వైపు ఆనందమోహన్ సూటిగా చూశాడు.

"ఈ గాజే కాదు! ఆ ఫియట్ కారు డ్రయివర్ని హోటల్ మిడ్‌లాండ్‌లోని వాళ్ళు పోల్చారు!"

సుందరం కనురెప్పలు చిట్లించాడు.

"మా డ్రయివర్ యెక్కడున్నాడు?"

"బయట పోలీసులతో మాట్లాడుతున్నాడు!" అబద్ధమాడాడు ఆనందమోహన్.

"మీకేం కావాలి?"

"ఆ కారులో వెళ్ళిన అమ్మాయి కావాలి!"

"ఆమె మీకు దొరికితే నన్నూ, నా కారునూ వదిలేస్తారా?"

"మాకు కావలసింది ఆ అమ్మాయి, మీరు కాదు!"

సుందరం ఒక కాగితంమీద ఏదో రాసి అతడికిచ్చాడు.

"అక్కడికి వెళ్ళండి. ఆ అడ్రెసు నేను యిచ్చినట్లు వాళ్ళకు చెప్పొద్దు. నేనిచ్చానని తెలిస్తే నన్ను చంపేస్తారు" అన్నాడతను.

అతడిచ్చిన కాగితాన్ని చూసి ఆనందమోహన్ జేబులో పడేసుకున్నాడు. ఇద్దరూ వేగంగా బయటకు వెళ్ళారు. స్కూటర్ని స్పీడుగా కాంపౌండులోంచి బయటకు పోనిచ్చాడు ఆనందమోహన్.

కొన్ని నిమిషాల తర్వాత ఆనందమోహన్ తన ఆఫీసుకు చేరుకున్నాడు. కాంతారావును తన టేబుల్ ముందు కూర్చోమని అతడు దస్తూర్ గదిలోకి గబగబా వెళ్ళాడు.

దస్తూర్ అతడివైపు సూటిగా చూశాడు.

"ఏమైంది?" అడిగాడు దస్తూర్.

"లీలను వాళ్ళు ఎక్కడ దాచివుంచినదీ తెలిసి కాని అక్కడకు ఒంటరిగా వెళ్ళడం ప్రమాదకరం నాకు పోలీసు సహాయం కావాలి" అన్నాడు ఆనందమోహన్.

ఆనందమోహన్ యిచ్చిన చీటీని దస్తూర్ చూశాడు రిసీవర్ ఎత్తి పోలీస్ కమీషనర్ రాజాతో మాట్లాడాడు ఆనందమోహన్ వైపు చూశాడు.

"ఆనంద్, అరగంటలో పోలీస్ వాన్ మన ఆఫీసుకు వస్తుంది. అందులో నువ్వు వెళ్ళొచ్చు. విష్ యు గుడ్ లక్!" అన్నాడు దస్తూర్.

ఆనందమోహన్ తన టేబుల్ దగ్గరకు వెళ్ళి కుర్చీలో కూర్చుని కాంతారావు వైపు చూశాడు.

"రామరాజు వచ్చేసరికి లీల నవ్వుతూ ఆయన ముందు వుంటుంది" అన్నాడతను.

"అతడు చాలా ఆనందిస్తాడు" అన్నాడు కాంతారావు.

ఆనందమోహన్ కాఫీ తెమ్మని నౌఖరుతో చెప్పి సిగరెట్ వెలిగించాడు.

11

యునైటెడ్ ఏజన్సీస్ కాంపౌండులో పోలీస్ వాన్ ఆగింది.

ఆనందమోహన్, కాంతారావు కిందకు దిగారు. పెద్ద భవనం. విశాలమైన ముందు హాల్లోకి యిద్దరూ నడిచారు.

యెదురుగా వాళ్ళకు సుందరం ప్రత్యక్షమయ్యాడు!

"మీకోసమే చూస్తున్నా, రండి! మీకు లీల

కావాలిగా!" అంటూ అతడు పిస్టల్‌ని వాళ్ళవైపు గురి పెట్టాడు.

"సుందరం, మేం ఒంటరిగా రాలేదు. మా ఇద్దర్నీ యిక్కడ తుదముట్టించవచ్చనే నమ్మకంతో నువ్వు యీ అడ్రెస్ రాసి మాకిచ్చావని అప్పుడే గ్రహించాను" అన్నాడు ఆనందమోహన్.

"ఏ మాటలు నేను నమ్మను!" అంటూ అతడు గుమ్మం వైపు అడుగులేసి బయటకు చూశాడు.

పోలీస్ వాన్ అతడికి కనిపించింది. అతను లోపలకు పరుగెత్తబోయాడు. అమాంతంగా మీదకు దూకి ఆనంద మోహన్ అతడిని పట్టుకున్నాడు.

కాంతారావు విజిల్ వేయగానే పోలీసులు వేగంగా హాల్లోకి జొరబడ్డారు.

"ఈ బిల్డింగ్‌లోని గదులన్నీ సోదా చేయండి" అరాన్నడు ఇన్‌స్పెక్టర్ రాజన్.

మేడమీద వెనకవైపున యిరవై గదులు వున్నాయి. ప్రతి గదిలోనూ వుందొక యువతి!

ఒక్కొక్క గదినే చూస్తూ ఆనందమోహన్, కాంతారావు పోలీసులు జరుగుతున్నారు.

విచారవదనంతో వున్న లీల ఆనందమోహన్ని చూసి, అమాంతంగా వచ్చి అతడికి కౌగలించుకుంది. ఆమె వెక్కి వెక్కి ఏడ్వసాగింది.

"లీలా, నువ్వు క్షేమంగా బయటపడ్డావు! సంతోషించు! నీతో అనేకమంది యువతులకు స్వేచ్ఛ లభించింది. అందుకు మనం ఆనందించాలి" అన్నాడు ఆనంద మోహన్.

ఆమె కాంతారావు వైపు చూసింది.

76

"అంకుల్, నీ పేరుతో వాళ్ళు నన్ను మోసం చేశారు" అని ఆమె ఏడ్చింది.

"ఏడవకమ్మా! రేపు నీ అన్నయ్య ఇక్కడ వుంటాడు. అతడు వచ్చేలోపల నువ్వు బయటపడినందుకు నాకు సంతోషంగా వుంది" అన్నాడు కాంతారావు.

ఇన్‌స్పెక్టర్ రాజన్ అక్కడికొచ్చి ఆనందమోహన్‌కి ధన్యవాదాలు అర్పించాడు.

"ఆనందమోహన్ గారూ, సుందరం యీ ముఠా అధిపతి. అందమైన యువతులను ఎత్తుకుపోయి వాళ్ళను గల్ఫ్ దేశాలవారికి పెద్ద మొత్తాలకు అమ్ముతున్నారు" అన్నాడు ఇన్‌స్పెక్టర్ రాజన్.

—:ఐ పో యిం ది:—